బిల్లుల చెల్లింపులో జాప్యం

- క్రీడా మైదానాలకు నిధులు మంజూరు కాక అవస్థలు
- స్పందించని అధికారులు



చిన్నపోతులపాడులో క్రీడా ప్రాంగణం(ఫైల్)

మానవపాడు: ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాలలో క్రీడాప్రాంగణాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రతి పల్లెలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు నిర్ణయించింది. గ్రామాలలో త్వరతగతిన నిర్మాణాలు చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత అధికారులు గ్రామాలలో స్థలాలను పరిశీలించారు. క్రీడా మైదానాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు చేయడంతో సర్పంచ్‌లు అప్పు చేసి పనులు పూర్తి చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో సర్పంచులు నానా అవస్థలు పడుతున్నారు. సంవత్సర కాలంగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా...

మండలంలోని 17 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ. లక్షకు పైగా, కొన్ని చోట్లా రూ.50వేలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. బిల్లుల జాప్యంపై పలుమార్లు నిరసనలు, జిల్లా అధికారులు, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కావడం లేదని మండల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అధికారులకు నివేదించాం

మండలంలోని వివిధ గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేశాం. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే బిల్లులు జీపీ ఖాతాలో జమ చేస్తా. జిల్లా అధికారులకు నివేదించాం.

– రమణరావు, ఎంపీడీఓ, మానవపాడు

అధికారుల జాప్యం చేస్తున్నారు



క్రీడాప్రాంగణాలకు చెందిన బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అందుతాయని చెప్పి పనులు పూర్తయ్యాకా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. అప్పులు తెచ్చి పనులు చేశాం.

– లక్ష్మీదేవి, సర్పంచ్, మద్దూరు

అప్పులు చేసి పనులు చేశాం



అప్పులు చేసి క్రీడా మైదానాలు ఏర్పాటు చేశాం. ఇతవరకు అధికారులు ఎంబీలు కూడా చేయలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. నేటికి బిల్లులు చెల్లించలేదు. పనులు చేసేందుకు అధికారులు ఒత్తిడి చేశారు. పనులు పూర్తయ్యాక బిల్లులు ఇచ్చేందుకు చొరవ తీసుకోవడం లేదు.

– ఆత్మలింగారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు

ప్రధాని మోదీ పర్యటనపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గద్వాల అర్బన్: ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పీతబస్టాండులో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపుతూ తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. సింగరేణిని ప్రవేటీకరణ నిర్ణయం సరికాదన్నారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టర్రీ, గిరిజన విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం, ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ వంటి విభజన చట్టంలోని హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, విష్ణు, దేవన్న, భాస్కర్, పరుశరాముడు, రామకృష్ణ, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అదే విధంగా స్వామి వారికి దాసంగాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లదరావు, ఈఓ సత్యెంద్రారెడ్డి నాయకులు మధుసూధన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్ రావు, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ ఉన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని శనివారం ఆలయంలోని భక్తులు దాసంగాలు సమర్పించి ప్రత్యేక నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చల్లంగా చూడాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేనా?


ధరూరు శివారులో యంత్రాలతో కోతలు కోస్తున్న రైతులు

ధరూరు: మండల వ్యాప్తంగా యాసంగి పంటలో భాగంగా రైతులు వరిసాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు వరికోత మిషన్ ద్వారా కోత చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వరి కొనుగోలు కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలపై స్పష్టత లేకపోవడంతో ఇతర రాష్ట్రాలను వరిధాన్యం తరలిస్తున్నారు. కొందరు ఇంటివద్దే ధాన్యం నిల్వచేసుకొని ఎదురుచూస్తున్నారు.

స్పష్టత కరువు

గతేడాది ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరిధాన్యం సేకరించారు. ప్రస్తుతం వరిపంట కోత చేస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలపై స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. చాలా మంది రైతులు పంట కోతకు వచ్చినా ధాన్యం నిల్వకు ఇబ్బంది ఉండటంతో కోత చేయడం లేదు. గిట్టు బాటు ధరను ప్రకటించినా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

రాయచూరుకు తీసుకు వెళ్తా



యాసంగిలో రెండు ఎకరాలలో వరిసాగు చేశా. పంట కోత చేశా. వరిధాన్యం నిల్వచేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రాయచూరులో వరిధాన్యం విక్రయిస్తా. వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతుల ఇబ్బందులను తొలగించాలి.

– దేవరాజ్, రైతు, ధరూరు

త్వరలో కొనుగోలు చేస్తాం



వరి ధాన్యం కొనుగోలుపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తాం. రైతులు తొందరపడి ఇతర రాష్ట్రాలలో అమ్ముకోవద్దు.

– శ్రీలత, ఏఓ, ధరూరు

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

అమరచింత: పురపాలిక అనుమతి లేకుండా పట్టణంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా హెచ్చరించారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో జన్నుపాండు తన ఇంటి ముందున్న రహదారిని అనుసరించి మరుగుదొడ్డి నిర్మిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సిబ్బందితో కలిసి వెళ్లి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ముందుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని.. అధికారుల అనుమతితో పనులు ప్రారంభించాలని సూచించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

గద్వాల క్రైం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. కృష్ణారెడ్డి బంగ్లా కాలనీకి చెందిన బాలరాజు కొన్ని రోజుల నుంచి భార్య పద్మను అదనపు కట్నం తీసుకురావాల్సిందిగా మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేశాడు. దీంతో వేధింపులు భరించలేక శనివారం బాధితురాలు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం శివారులో గత నెల 7వ తేదీ 40 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా గుర్తు తెలియని వ్యక్తులు డంప్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శుక్రవారం పంచలింగాల గ్రామానికి చెందిన శాలీబాషాను ఇసుక డంప్ చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని గద్వాల కోర్టులో హాజరుపరిచారు. శనివారం నిందితుడిని కోర్టులో హాజరపరచగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

వ్యక్తిపై దాడి ఘటనలో..

కేటీదొడ్డి: ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఈనెల 6న గువ్వలదిన్నె గ్రామానికి చెందిన కృష్ణమోహన్ రెడ్డి తల్లితో గొడవ పడుతుండగా శాంతింపజేసేందుకు యత్నించిన బోయ పెద్ద హనుమంతు ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కృష్ణమోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

అలంపూర్ రూరల్: పేదల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని జిల్లెలపాడ్, సూల్తాన్‌పూర్, ర్యాలంపాడ్ గ్రామాలలో ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమం నిర్వహించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దిలేటి, ముజీబ్, చంద్రశేకర్ నాయుడు, విశ్వం, భాస్కర్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లుఅర్జున్ పుట్టిన రోజు వేడుకలు

కేటీదొడ్డి: సినీ హీరో అల్లు అర్జున్ జన్మదిన సందర్భంగా శనివారం అభిమానుల సంఘం మండల అధ్యక్షుడు మురళిగౌడ్ ఆధ్వర్యంలోని కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వెంకటేష్ నాయుడు, స్వామి, శివ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ హామీలు అమలుచేయాలి..


అమరచింతలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అమరచింత: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ సీపీఎం నాయకులు పట్టణంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ.. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన ఉద్యాన యూనివర్సిటీ మంజూరు చేయాలన్నారు. బయ్యారం, సింగరేణి గనుల ప్రైవేటీకరణ మానుకోవాలని కోరారు. రాష్ట్రంలో వసూలైన జీఎస్టీ నిధులను తిరిగి ఇవ్వాలన్నారు. వందేభారత్ రైళ్లలో ఛార్జీలు తగ్గించాలని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అజయ్, రవి, ప్రకాష్, సుజ్ఞానం, చందు, శంకర్, ఫయాజ్, వినోద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న

అయిజ: పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. శనివారం పట్టణంలోని 11 వార్డులో ఆయన పర్యటించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా సక్రమంగా రావడం లేదని ఆయా కాలనీవాసులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రైయినేజీల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలని, రోడ్లను పరిశుభ్రంగా ఊడ్చాలని సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ లైన్‌మెన్ నరసింహులు, బిల్ కలెక్టర్లు అజ్మీర్ ఖాజా, అడివన్న, మహేంద్రనాథ్, ఆంజనేయులు, వీరేష్, శివ, మధు, వినోద్, ఎలక్ట్రిషియన్లు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా పదో తరగతి పరీక్షలు


మానవపాడులో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు


అంబులెన్స్‌లో విద్యార్థి నితిన్ కడుపు నొప్పితో ..

మానవపాడు: పేపర్ లీక్ కారణంగా పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 286 మంది విద్యార్థులకు 284 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో చీఫ్ సూపరిండెంట్ బాలజీకృష్ణకుమార్, డిపార్ట్‌మెంటల్ అధికారి వేణుగోపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రంలో 242 మందికి 241 మంది విద్యార్థులు, ఉప్పేరులో 278 మందికి 277, మార్లబీడులో 159 మంది విద్యార్థులకు 156 మంది హాజరయ్యారు. మొత్తం 5 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి నితిన్ గణిత పరీక్షకు హాజరయ్యాడు. గంట తర్వాత విద్యార్థికి కడుపునొప్పి రావడంతో ఇన్విజిలేటర్‌కు సమస్యను వివరించాడు. దీంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది విద్యార్థికి ఓఆర్ఎస్ పాకెట్స్ అందజేశారు. ప్రతిరోజు అలంపూర్ మండలం క్యాతూరు నుంచి విద్యార్థి పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష అనంతరం విద్యార్థి నితిన్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 135 మందికి 135 మంది విద్యార్థులు, ప్రైమరీ పాఠశాలలో 129 మందికి 127 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నేడు ఆరోగ్య జాతర


మాట్లాడుతున్న మధుగౌడ్

అయిజ: మండలంలోని ఉప్పలలో ఆదివారం లైఫ్ లైన్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆరోగ్య జాతర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు కానున్నట్లు అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని ఉప్పలలో ఆరోగ్య జాతర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుగౌడ్ మాట్లాడుతూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరోగ్య జాతరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలంగాణలో దోపిడీ పాలన : కాంగ్రెస్


గోవిందహళ్లిలో పార్టీ జెండా ఎగురవేసి నినాదం చేస్తున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

మదనాపురం: తెలంగాణలో దోపిడీ పాలన కొనసాగుతోందని.. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గోవిందహళ్లిలో హాథ్ సే హాథ్ జోడోయాత్రంలో భాగంగా గడప గడపకు తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఉచిత విద్యుత్, ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, అమ్మ హస్తం పేరుతో రేషన్ దుకాణాల్లో 9 రకాల నిత్యావసర సరుకులు, 108, 104 అంబులెన్స్ సేవలు, జలయజ్ఞం కింద ఎత్తిపోతల పథకాలు నిర్మించామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అంజద్‌అలీ, మహేష్, రామచంద్రయ్య, నరోత్తంరెడ్డి, ఆవుల రాఘవేంద్ర యాదవ్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మంగరాయల శివ, కావలి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బాలచెలిమి' పుస్తకాల వితరణ


పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం బాల చెలిమి చిల్డ్రన్స్ అకాడమీ, హైదరాబాద్ వారు కథల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న విజయకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులతో కథలు చదివించడంతో భాషా నైపుణ్యం పెరగడంతో పాటు నీతి గ్రహించి పఠన ఆసక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతాయన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి కథల పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ గట్టయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14 నుంచి ఇంటింటికి పాదయాత్ర



గద్వాల అర్బన్: బీజేపీ కో హటావ్ దేశ్‌కో బచావ్ అనే నినాదంతో ఈనెల 14 నుంచి జిల్లాలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి పాదయాత్ర చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ సంఘాలు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రంగన్న, నాయకులు పెద్ద బాబు, ఆశన్న, రమేష్, పరమేష్, కృష్ణ, శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ సభకు తరలిన నాయకులు



మానవపాడు: హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు శనివారం ఇటిక్యాల మండలంలోని బీజేపీ మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

రాజోళి: మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావ్, ఎమ్మెల్యే అబ్రహానికి వినతి పత్రం అందించారు. శనివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కాలేజీ సాధన సమితి నాయకులు కలిశారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. కళాశాల లేక విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ ఈశ్వరయ్య, చంద్రగౌడ్, జయన్న గౌడ్, అడివి స్వామి, గంగిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



అయిజ: మండలంలోని సంకాపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా విధులు నిర్వర్తించారు. జిల్లా కలెక్టర్‌గా నవ్య, డీఈఓగా విజయ్‌కుమార్, ఎంఈఓగా మల్లీశ్వరి, హెడ్‌మాస్టర్‌గా శిరీష వ్యవహరించారు. అదేవిధంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఉప్పల గోపాల కృష్ణమూర్తి ఏకాదశ దినకర్మకు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా రామాపురంలో నాగమ్మ మృతదేహంపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, జయన్న, కొంకల సత్యప్రసాద్‌రెడ్డి, యోగిరెడ్డి, వెంకట్రామన్, కరుణాకర్‌రెడ్డి, దేవేంద్ర, సుజాత, నాగశిరోమణి, సులోచనమ్మ, దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

శాంతినగర్: రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు పట్టణానికి చెందిన ఆల్-మదీన యూత్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక మదీన మసీద్‌లో శనివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు ధార్మిక సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో రజాక్, కలీముల్లా మౌలానా, తదితరులు పాల్గొన్నారు.